### కోతుల ప్రభావంతో తగ్గిన సాగు



జిల్లాలో కూరగాయల సాగు ఎక్కువగా ఖమ్మం నగర శివారు మండలాల్లో సాగు జరుగుతుంది. అయితే రియల్ ఎస్టేట్ వ్యాపారంతోపాటు సాగుకు కోతుల బెడద ఎక్కువగా ఉంది. దీంతో కూరగాయల సాగు తగ్గింది. దీనిని అధిగమించేందుకు ప్రత్యామ్నాయ చర్యలు చేపడుతున్నాం. రైతులకు రాయితీపై సోలార్ ఫెన్సింగ్ అందించేందుకు ప్రభుత్వం ఆలోచన చేస్తోంది. ఇతర మండలాల్లో కూడా రైతులు కూరగాయల సాగు చేపట్టే విధంగా అవగాహన కల్పిస్తున్నాం.

– బీవీ.రమణ,
జిల్లా ఉద్యాన శాఖ అధికారి

### కూలీల ఖర్చు, నీటి ఎద్దడి ఉంది



గతంతో పోల్చితే ఈ ఏడాది కూలీల ఖర్చు బాగా పెరిగింది. అయినా సాగు చేద్దామనుకుంటే నీటి ఇబ్బంది బాగా ఉంది. ఏటా కూరగాయలతోపాటు ఆకు కూరల సాగు చేస్తున్నా. అయితే ఈ ఏడాది మాకు కొద్దిగా నీటి వసతి ఉండడంతో ఆ నీటితోనే బెండకాయ, అకుకూరలు సాగు చేశాను. రైతుబజార్‌కు వెళ్లి దళారులకు అడ్డికి పావుశేరు అమ్ముతున్నాం. ప్రభుత్వం కూరగాయల సాగు చేపట్టే రైతులకు రాయితీలు ఇస్తే చాలా మంది సాగు చేసేందుకు ముందుకొస్తారు.

–ఎస్.శ్రీనివాసరావు, ఉద్యాన పంటల
సాగు రైతు, ముత్తగూడెం, రూరల్ ఒడలం

- గణనీయంగా తగ్గిన కూరగాయల సాగు
- ఖమ్మం జిల్లా 'యాసంగి' చరిత్రలో తొలిసారి
- ఇతర జిల్లాలు, రాష్ట్రాల నుంచి నేరుగా దిగుమతి
- వినియోగదారులపై ఇక మరింత భారం

# 674 ఎకరాలే..



ఖమ్మం హోల్‌సేల్ కూరగాయల మార్కెట్లో ఇతర ప్రాంతాల నుంచి వచ్చిన వాహనాలు (ఫైల్)

| యాసంగి సాగు |
| --- |
| 2023-24 : 674 ఎకరాలు |
| 2022-23 : 892 ఎకరాలు |
| 2021-22 : 1,815 ఎకరాలు |
| 2020-21 : 2,023 ఎకరాలు |

ఖమ్మం వ్యవసాయం, ఏప్రిల్ 9 : ఖమ్మం జిల్లా రైతాంగం ఈ ఏడాది యాసంగిలో అతితక్కువ విస్తీర్ణంలో కూరగాయలు సాగు చేస్తున్నారు. ఇంత తక్కువ సాగుకావడం జిల్లా చరిత్రలో ఇదే తొలిసారి. దీంతో స్థానిక హోల్‌సేల్ కూరగాయల వ్యాపారులు అన్నిరకాల కూరగాయలను ఇతర జిల్లాలు, రాష్ట్రాల నుంచి దిగుమతి చేసుకుంటున్నారు. ఈక్రమంలో రవాణా ఖర్చుల భారం పడుతుండడంతో ఆ ప్రభావం వినియోగదారులపై స్పష్టంగా కనపడుతున్నది. ఖమ్మంజిల్లా ఉద్యానపంటల సాగుకు పెట్టింది పేరు. పండ్లు, పూల సాగుతోపాటు కూరగాయల సాగుకు ఇక్కడి భూములు అనుకూలంగా ఉండడంతో దశాబ్దాల నుంచి అనేక విలువైన పూలు, పండ్ల పంటల సాగు జరుగుతుంది. ఆయిల్‌ఫాం, తాయ్ జామ, ఆపిల్ బేర్, జర్బర పూల సాగుతో పాటు ఆకుకూరలు, కూరగాయల సాగు గణనీయంగా ఉంటుంది. ఇందుకు ప్రధాన కారణం లక్షలాది మంది జనాభా కలిగిన జిల్లాకేంద్రం ఖమ్మంతో పాటు వైరా, మధిర, సత్తుపల్లి పట్టణాలు సైతం అందుబాటులో ఉన్నాయి. వీటి పరిధిలోని రైతులు మార్కెటింగ్ చేసుకునేందుకు రైతుబజార్లు, ఇతర కూరగాయల మార్కెట్లు సైతం అందుబాటులో ఉన్నాయి. ఇన్ని రకాల సౌకర్యాలు, వనరులు అందుబాటులో ఉన్నప్పటికీ ఈ సంవత్సరం యాసంగి సీజన్‌లో కూరగాయల సాగు గణనీయంగా తగ్గడం ఆందోళనను కలిగిస్తున్నది. గత కొద్దిరోజుల నుంచి వ్యాపారులు టమాటను ఆంధ్రా, ఆలుగడ్డలను మధ్య ప్రదేశ్, ఇతర కూరగాయలను ఆయా రాష్ట్రాల నుంచి దిగుమతి చేస్తున్నారు. మరికొద్దిరోజుల్లో ఆయా ప్రదేశాల్లో సైతం ధరలు పెరిగే అవకాశం ఉందని తద్వార కూరగాయల ధరాభారం వినియోగదారులపై మరింత పడే అవకాశం ఉన్నట్లు స్పష్టంగా కనపడుతున్నది.

#### జిల్లాలో సాగు ఇలా..

జిల్లా ఉద్యానశాఖ గణాంకాల ప్రకారం ఈ యాసంగి సీజన్‌లో జిల్లావ్యాప్తంగా 750 మంది రైతులు సుమారు 674 ఎకరాల్లో సీజన్ ఆరంభంలో కూరగాయల సాగు చేపట్టారు. కామేపల్లి మండలంలో 20 మంది రైతులు 16.39 ఎకరాలు, ఖమ్మం అర్బన్‌లో 119మంది 137 ఎకరాలు, రఘునాథపాలెంలో 133మంది 284 ఎకరాల్లో సాగు చేశారు. ఖమ్మంరూరల్‌లో 71మంది 59 ఎకరాలు, కూసుమంచిలో 53 మంది 38 ఎకరాలు, నేలకొండపల్లిలో 29 మంది 12ఎకరాలు, తిరుమలాయపాలెంలో 20 మంది 17 ఎకరాలు, బోనకల్‌లో 21మంది 16 ఎకరాలు, చింతకానిలో నలుగురు 10 ఎకరాలు, మధిరలో 31 మంది 26 ఎకరాలు, ముదిగొండలో 40మంది 22 ఎకరాలు, కల్లూరులో 34 మంది 15 ఎకరాలు, పెనుబల్లిలో ఆరుగురు 5 ఎకరాలు, సత్తుపల్లిలో 34 మంది 36 ఎకరాలు, తల్లాడలో 6 మంది 3ఎకరాలు, వేంసూరులో 54మంది 55 ఎకరాల్లో వివిధ రకాల కూరగాయల పంటల సాగు చేస్తున్నారు. ఏన్కూరులో 11మంది 11 ఎకరాలు, కొణిజర్లలో 16 మంది 15 ఎకరాలు, సింగరేణి మండలంలో 18మంది 13 ఎకరాలు, వైరాలో ఆరుగురు 3 ఎకరాల్లో సాగు చేపట్టారు. అయితే ప్రస్తుతం ఈ గణాంకాల్లో సగానికి సగం సాగు తగ్గిపోయి ఉంటుందని అధికారులు చెబుతున్నారు.

#### వెలవెలబోతున్న రైతుబజార్లు

సాధారణంగా కూరగాయల సాగు విస్తీర్ణం గణనీయంగా ఉంటే అదేస్థాయిలో రైతుబజార్లలో రైతుల సంఖ్య భారీగా కనపడుతుంది. తద్వారా వినియోదారుల తాకిడి ఉంటుంది. ప్రస్తుతం ఖమ్మం నగరంతో పాటు మధిర, సత్తుపల్లి పట్టణాల్లో ఉన్న రైతుబజార్లు రైతులు లేక, వినియోగదారులు రాక వెలవెలబోతున్నాయి. తప్పనిసరి పరిస్థితిలో రైతులు హోల్‌సేల్ కూరగాయల మార్కెట్ నుంచి ప్రైవేట్ వ్యాపారుల దగ్గర కూరగాయలు, ఆకుకూరలు సైతం కొనుగోలు చేసి తీసుకొచ్చి వినియోగదారులకు అమ్ముతున్నారు. ఖమ్మం నగరానికి సమీపంలోని రఘునాథపాలెం, కూసుమంచి, రూరల్ మండలంతోపాటు కొణిజర్ల, ఖమ్మంఅర్బన్ మండలంలో కూరగాయల సాగు భారీగా జరుగుతుంది. ఈ ప్రాంతాల్లో సాగు చేపట్టిన రైతులు స్వయంగా వారే రైతుబజార్లకు, ఇతర రద్దీ ప్రదేశాలకు తీసుకొచ్చి అమ్ముకునేవారు. గడిచిన వారంరోజుల నుంచి నగరంలో పంటను తీసుకవచ్చే రైతుల సంఖ్య సైతం అమాంతం పడిపోయింది. రైతుబజార్లు, కూరగాయల మార్కెట్లో దళారులు మాత్రమే కనపడుతున్నారు. అయితే సాగునీటి వనరులు కలిగిన ప్రాంతాల్లో రైతులకు ఉద్యానశాఖ అధికారులు అవగాహన కల్పించి సాగు పెరిగేలా కృషిచేయాలని ప్రజలు కోరుతున్నారు.

# శ్రీక్రోధి.. ఊరూరా ఉగాది

- ఉమ్మడి జిల్లావ్యాప్తంగా తెలుగు సంవత్సరాది వేడుకలు
- సంస్కృతీ సంప్రదాయాలను ప్రతిబింబించేలా పండుగ
- భక్తులతో కిటకిటలాడిన ప్రముఖ క్షేత్రాలు
- పలు ఆలయాల్లో పంచాంగ శ్రవణం చేసిన వేద పండితులు



కొత్తగూడెం టౌన్ : పంచాంగ శ్రవణంలో పాల్గొన్న భక్తులు

*శోభకృత్ నామ సంవత్సరానికి వీడ్కోలు పలికి.. చైత్ర శుద్ధ పాడ్యమి రోజున నూతన తెలుగు సంవత్సరాది ఉగాది పండుగను మంగళ వారం ఉమ్మడి జిల్లావ్యాప్తంగా ప్రజలు సంస్కృతీ సంప్రదాయాలను ప్రతిబింబించే విధంగా జరుపుకున్నారు. ఉదయమే ఇళ్ల గుమ్మాలకు మామిడి తోరణాలు కట్టి.. తీరొక్క పూలతో అలంకరించి.. ముంగిళ్లను రంగురంగుల ముగ్గులతో అలంకరించి పండుగ శోభను తీసుకొచ్చారు. ఉదయమే తలంటు స్నానాలు ఆచరించి నూతన వస్త్రాలు ధరించి ఇంటిల్లిపాది పూజా మందిరంలో ఇష్టదైవాలకు భక్తిభావంతో పూజలు చేశారు. షడ్రుచుల సమ్మేళనంతో తయారు చేసిన ఉగాది పచ్చడిని దేవుడికి నైవేద్యంగా సమర్పించి తర్వాత కుటుంబ సభ్యులు స్వీకరించారు. ఉగాది పర్వదినం సందర్భంగా ప్రముఖ ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. గోత్రనామాలతో అర్చకులు ప్రత్యేక పూజలు చేసి తీర్థప్రసాదాలు అందజేశారు. వేద పండితులు పంచాంగ శ్రవణం చేశారు. కొత్త సంవత్సరంలో జన్మ నక్షత్రాలనుబట్టి యోగ క్షేమాలు, ఆదాయ వ్యయాల గురించి వివరించారు.* *-నమస్తే తెలంగాణ నెట్‌వర్క్, ఏప్రిల్ 9*

## ప్రజలు సుఖసంతోషాలతో జీవించాలి

### ఉగాది వేడుకల్లో ఖమ్మం ఎంపీ నామా నాగేశ్వరరావు



ఉగాది వేడుకల్లో మాట్లాడుతున్న ఎంపీ నామా నాగేశ్వరరావు, చిత్రంలో ఎమ్మెల్సీ తాతా మధు

ఖమ్మం, ఏప్రిల్ 9 : శ్రీక్రోధ నామ సంవత్సరంలో ప్రజలంతా సుఖసంతోషాలతో జీవించాలని, అనుకున్న కోరికలు, లక్ష్యాలు సిద్ధించి భవిష్యత్ వైపు ముందుకు సాగాలని బీఆర్ఎస్ ఖమ్మం ఎంపీ అభ్యర్థి, ఎంపీ నామా నాగేశ్వరరావు ఆకాంక్షించారు. ఖమ్మం స్వర్ణభారతి కల్యాణ మండపంలో కమ్మ మహాజన సంఘం నేతృత్వంలో మంగళవారం నిర్వహించిన ఉగాది వేడుకలకు నామా ముఖ్యఅతిథిగా హాజరై ఉమ్మడి జిల్లా ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇప్పటికే కరువుతోపాటు అనేక సమస్యలతో రైతులు ఇబ్బంది పడుతున్నారని, రానున్న రోజుల్లో వర్షాలు సమృద్ధిగా కురిసి వ్యవసాయ సీజన్ బాగుండాలని ఆకాంక్షించారు. ఉగాది పండుగను కుటుంబ సభ్యులు, స్నేహితులు సంతోషకర వాతావరణంలో జరుపుకోవాలన్నారు. అనంతరం నిర్వాహకులు ఎంపీ నామాను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్సీ తాతా మధు, కమ్మ సంఘం నాయకులు ఎర్నేని రామారావు, స్థానికులు నల్లమల వెంకటేశ్వరరావు, కాటంనేని రమేశ్, మోరంపూడి ప్రసాద్, తన్నీరు రవి, నామా సేవా సమితి నుంచి తాళ్లూరి హరీశ్, రాజేశ్, చీకటి రాంబాబు, కృష్ణప్రసాద్ పాల్గొన్నారు.

## ఇఫ్తార్ విందులో మాజీ ఎమ్మెల్యే సండ్ర



ముస్లిం సోదరుడికి పండు తినిపిస్తున్న మాజీ ఎమ్మెల్యే సండ్ర

సత్తుపల్లి టౌన్, ఏప్రిల్ 9: పట్టణంలోని ప్రధాన ప్రసాద్ జామియా మసీద్‌లో ముస్లింలకు ఖమ్మం పార్లమెంట్ అభ్యర్థి నామా నాగేశ్వరరావు ఇచ్చిన ఇఫ్తారు విందులో మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య పాల్గొని ముస్లింలకు రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. సత్తుపల్లి పట్టణ పరిధిలోని రాజీవ్‌నగర్, కాకర్లపల్లి, వేంసూరు రోడ్‌లోని రైతుబజార్, ఎన్టీఆర్ కాలనీలోని మసీద్‌తో పాటు వెంగళరావునగర్‌లోని మదర్‌సా, వెంగళరావునగర్ మసీద్‌లోని ముస్లింలకు పార్లమెంట్ అభ్యర్థి నామా నాగేశ్వరరావు ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో సత్తుపల్లి మున్సిపల్ చైర్మన్ కూసంపూడి మహేశ్, జామియా మసీద్ సదర్ ముకరం, మాజీ సదర్ మున్వర్, బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు రఫీ, లారీ అసోసియేషన్ నాయకులు మౌలాలి, మస్తాన్, సలీమ్ మాస్టారు, షాకీర్, ముక్తార్, నాయకులు దొడ్డా శంకర్‌రావు, కౌన్సిలర్ వేములపల్లి మధు పాల్గొన్నారు.

- శ్రీసీతారామచంద్రస్వామికి ప్రత్యేక పూజలు
- నేత్రపర్వంగా అభిషేకాలు

# భద్రాద్రిలో బ్రహ్మోత్సవాలు ప్రారంభం





భద్రాచలంలోని శ్రీ సీతారామచంద్రస్వామి ఆలయంలో ఉత్సవమూర్తులకు సహస్రధారలతో అభిషేకం చేస్తున్న అర్చకులు

భద్రాచలం, ఏప్రిల్ 9 : భద్రాద్రి కొత్తగూడెం జిల్లా భద్రాచలం పట్టణంలోని శ్రీ సీతారామచంద్రస్వామి దేవస్థానంలో మంగళవారం వసంతపక్ష ప్రయుక్త శ్రీరామనవమి నవాహ్నిక తిరుకల్యాణ బ్రహ్మోత్సవాలు నేత్రపర్వంగా ప్రారంభమయ్యాయి. ఉదయం గోదావరి తీరం నుంచి వెండి తీర్థపు బిందెలో గోదావరి జలాలను తీసుకొచ్చారు. స్వామివారికి విశ్వక్సేన ఆరాధన, దైవ ప్రార్థన, ఆలయ ప్రదక్షిణ చేసి అంతరాలయంలోని మూలవరుల వద్ద ఉత్సవానుజ్ఞ తీసుకున్నారు. అనంతరం బేడా మండపానికి ఉత్సవమూర్తులను తీసుకొచ్చి భగవత్ పుణ్యాహవాచన చేసి, 28 మంది బుత్విక్‌లకు దీక్షావస్త్రాలు, కంకణధారణ నిర్వహించారు. అంతరాలయంలోని మూలవరులు, ఉత్సవ మూర్తులు, నిత్య కల్యాణమూర్తులకు కణ్ణన్, ఆళ్వారు తల్లికి, రామదాసు పీఠానికి కంకణధారణ చేశారు. మంగళవాయిద్యాలతో బేడా మండపానికి వచ్చి ఉత్సవ పెరుమాళ్లకు కంకణధారణ చేశారు. ఆచార్య, బ్రహ్మ, బుత్విక్‌లకు, ఆలయ అధికారులకు కంకణధారణ నిర్వహించారు. నవకలశ స్నపనం, ఉత్సవారంభ స్నపనం, నేత్రపర్వంగా జరిపారు. 108లీటర్ల పాలతో, అందులో సగభాగం పెరుగు, నెయ్యి, తేనె, పంచదార పంచామృతాలు, 9రకాల పళ్ల రసాలు, హరిద్రాచూర్ణం, గంధోదకం, సమస్త నదీ తీర్థములు, అయోధ్య నుంచి ప్రత్యేకంగా తెప్పించిన సరయూ నది తీర్థం, సహస్రధారలు, తులసిమాలలు, సాలగ్రామ హారములు, శ్రీయంత్రము, షోడశోపచారములు, కుంభ, ధ్వజ, అష్ట, ద్వాదశ హారతులు, పంచ ఉపనిషత్తుల మంత్రములు, ద్రావిడ పారాయణంతో నేత్రపర్వంగా రామయ్యకు అభిషేకం నిర్వహించారు. యాగశాల వద్ద ఓంకార ధ్వజారోహణాన్ని ఎగురవేశారు. సాయంత్రం 5 గంటలకు తాతగుడి సెంటర్‌లో ఉన్న గోవిందరాజస్వామి ఆలయానికి వెళ్లి, గునపానికి పసుపు రాసి రక్షాబంధన గావించి, మట్టిపై వరాహం బొమ్మను వేసి న్యాస ధ్యానాదులు సమర్పించి, అర్ఘ, పాద్యాదులు సమర్పించి, మృత్సంగ్రహణం(పుట్టమన్నుతో) భక్తి, ప్రపత్తులతో నిర్వహించారు. పుట్టమన్నును సేకరించి, ఒక చిన్న పల్లకిలో పుట్టమన్నును ఉంచి, మరొక వాహనంలో గరుత్మంతుడు, హనుమంతుడు, సైన్యాధిపతి విశ్వక్సేనుడిని ఉంచారు. రామయ్యను కల్పవృక్ష వాహనంపై తిరువీధి సేవ జరిపారు. యాగశాలలో పుట్టమన్నుతో పూజ నిర్వహించారు. 12పాలికలతో అంకురార్పణ జరిపారు. నవధాన్యాలు, ధాన్యంతో సోమకుంభాన్ని ఆవాహన చేసి సోమున్ని ఆవాహన చేసి, ఆఖండ దీపారాధన, క్షేత్ర పాలికుడిని, వాస్తు పురుషున్ని నాలుగు ద్వారముల దగ్గర ఎనిమిది కుంభములు ఉంచి, ద్వారతోరణ పూజ చేశారు. మోదుగు, రావి, జువ్వి, మేడి తోరణాలు కట్టారు. స్వామివారికి విడాహ్ వాచన(కుల దేవత) ఆవాహన చేసి, వాస్తు పురుషున్ని ఆవాహన చేశారు. అంకురారోపణ హవనం, వాస్తు హవనం, జరిపారు. అందులోని సంపాదాజ్యమును అంకురార్పణ పాలికలయందు, వాస్తుకూర్చయందు తమలపాకులతో స్పృశించారు. అనంతరం ఉత్సవ పెరుమాళ్లను బేడా మండపంలో ఉంచి, నూతన సంవత్సరాది పండుగ సందర్భంగా కేశ స్థలశాయి నేతృత్వంలో స్వామివారి పాదాల వద్ద పంచాంగాలను ఉంచారు. విశ్వక్సేన ఆరాధన, పుణ్యాహవాచన జరిపి ఆ తీర్థాన్ని పంచాంగాలపై ప్రోక్షించారు. సరస్వతీదేవిని ఆవాహన చేసి సరస్వతి పూజ, లక్ష్మి అష్టోత్తర శతనామార్చన పసుపు, కుంకుమ, గంధం, ధూప, దీప నైవేద్యాలను సమర్పించారు. పంచాంగాన్ని స్వామివారి పాదాల చెంత ఉంచి, మరో పుస్తకాన్ని వశిష్టుల వారికి(పంచాంగం చెప్పే) అర్చకుడికి ఇచ్చారు. ముందుగా ఆలయ మర్యాదలతో సత్కరించి నమస్కరించారు. ఈ ఏడాది రామయ్య ఆదాయ, వ్యయం, సమానంగా ఉన్నట్లు తెలిపారు. రామయ్య పౌర్ణమి వరకు దీక్షలో ఉంటారు కావున ఏకాంత సేవలు, నిత్య కల్యాణాలు నిలిపివేశారు. రాజ దర్బార్ సేవలు, ఆర్జిత సేవలు రద్దు చేశారు. గాలిగోపురానికి అభిముఖంగా ఉన్న ఆంజనేయస్వామికి మంగళవారం సందర్భంగా పంచామృతాలతో అభిషేకం నిర్వహించారు. తమలపాకులతో పూజ చేసి గంధ సింధూరాన్ని పూశారు. సాయంత్రం ఆంజనేయస్వామికి అప్పాలు, అరిసెలు నివేదించారు.

### పర్ణశాలలో బ్రహ్మోత్సవాలు షురూ..



పర్ణశాల ఆలయంలో బ్రహ్మోత్సవాలను ప్రారంభిస్తున్న అర్చకులు

పర్ణశాల, ఏప్రిల్ 9 : ప్రముఖ పుణ్య క్షేత్రమైన పర్ణశాలలో ఈ నెల 17న శ్రీరామ నవమి నిర్వహించనున్న సందర్భంగా మంగళవారం బ్రహ్మోత్సవ కార్యక్రమాలను అర్చకులు, అధికారులు వైభవోపేతంగా ప్రారంభించారు. ఉగాది పర్వదినం సందర్భంగా ఉదయం 5 గంటల నుంచి మూల విరాట్‌లకు అభిషేకాలు, నూతన వస్త్రాలంకరణ తోపాటు స్వామివారికి వేద విన్నపములు, భగవద్భర్ధన, విశ్వక్సేన పూజ, పుణ్యాహవాచనం, రక్షాబంధనం, రుత్విగ్వరణం, మత్స్య గ్రహణం, బ్రహ్మోత్సవాల అంకురారోపణ కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు.

అనంతరం ఆలయ ప్రాంగణంలో పంచాంగముల పూజా కార్యక్రమం నిర్వహించి పంచాంగ శ్రవణం చేపట్టారు. పంచాంగ శ్రవణంలో భాగంగా శ్రీక్రోధి నామ సంవత్సరంలో రాష్ట్రం అన్ని విధాలా ఎంతో అభివృద్ధి చెందుతుందని పండితులు తెలిపారు. సాయంత్రం తిరువీధి సేవను కనుల పండుగగా నిర్వహించారు. కార్యక్రమంలో ముఖ్య అర్చకులు శేష కిరణ్‌కుమారాచార్యులు, భరద్వాజాచార్యులు, నవమి ఫెస్టివల్ ఆఫీసర్ అనిల్, సూపరింటెండెంట్ కిశోర్, గుమస్తా ప్రసాద్, సిబ్బంది రాము, శివ పాల్గొన్నారు.

### పాల్వంచ పెద్దమ్మతల్లి ఆలయంలో..

## వసంత నవరాత్రి ఉత్సవాలు ప్రారంభం



పూజల్లో పాల్గొన్న ఈవో దంపతులు

పాల్వంచ రూరల్, ఏప్రిల్ 9: మండలంలోని కేశవాపురం – జగన్నాథపురం గ్రామాల మధ్యగల పెద్దమ్మతల్లి దేవాలయంలో మంగళవారం శ్రీదేవీ వసంత నవరాత్రి ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. ఆలయ ఈవో సుదర్శన్ దంపతులు కలశపూజ చేసి తొమ్మిది రోజులపాటు జరిగే ఈ ఉత్సవాలను ప్రారంభించారు. ఈ వేడుకలు ఈ నెల 17 వరకు కొనసాగనున్నాయి. ఉదయం కలశపూజ, అనంతరం గణపతిపూజ జరిగాయి. ఆ తరువాత పుణ్యాహవాచనం, పంచగవ్యప్రాసన, రుత్వీకరణ, దీక్షా వస్త్రధారణ, అఖండ దీపారాధన తదితర పూజా కార్యక్రమాలను నిర్వహించారు. ఈవో దంపతులు అర్చకులకు దీక్షా వస్త్రాలు అందించారు. మధ్యాహ్నం లక్ష కుసుమార్చన చేశారు. ఆలయ కళాక్షేత్రంలో పంచాంగ శ్రవణ కార్యక్రమం నిర్వహించారు. ఉగాది పర్వదినం సందర్భంగా మండలంలోని పలు ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో హాజరై అమ్మవారిని దర్శించుకుని పూజలు చేశారు.

- మొక్కజొన్న రైతులకు సాగునీటి కష్టాలు
- కాపాడుకునేందుకు భగీరథ ప్రయత్నం
- కంకి దశలో నీరందక ఎండిపోతున్న పంట
- ఆందోళన వ్యక్తం చేస్తున్న మక్కసాగు రైతులు

# కంకి పంట ఖతమే!



ఎండిపోతున్న మొక్కజొన్న పంట



ఖమ్మం రూరల్, ఏప్రిల్ 9 : ఏటా యాసంగి సీజన్‌లో ఉన్న నీటివనరుల ఆధారంగా రైతులు ప్రధానంగా వరి, మొక్కజొన్న పంటలు పండిస్తుంటారు. ఈ ఏడాది కూడా అదే ఒరవడి కొనసాగించిన రైతులు చివరకు మొక్కజొన్న పంటకు నీరందకపోవడంతో కళ్లముందే ఎండిపోతుంటే కన్నీళ్లు పెట్టుకున్నారు. పెట్టిన పెట్టుబడి కూడా వచ్చే పరిస్థితి లేకపోవడంతో పంట కోసం చేసిన అప్పు ఎలా తీర్చాలని మదనపడుతున్నారు. జిల్లాకు నీరందించే సాగర్ కాల్వలో ప్రస్తుత యాసంగి సీజన్‌లో నీటి లభ్యత ఉండకపోవచ్చని అధికారులు ముందస్తుగా తెలిపిన విషయం విదితమే. ఈ క్రమంలో సాగర్ కాల్వ పరీవాహక ప్రాంతంలోని ముత్తగూడెం, ఆరెకోడు, చింతపల్లి, ఆరెంపుల, పల్లెగూడెం, తెల్దారుపల్లి తదితర గ్రామాల రైతులు మొక్కజొన్న పంటను ఎక్కువ విస్తీర్ణంలో సాగు చేశారు. పంట ఆరంభంలో బోరు బావుల్లో ఉన్న నీరు, కాల్వ ద్వారా కొంత నీరు రావడంతో పంటకు సరిపోతుందనే ఉద్దేశంతో పారించుకున్నారు. అయితే పంట ఎదుగుతున్నకొద్దీ నీటి అవసరం ఎక్కువ కావడం.. బోరు బావులు, కాల్వల్లో జలాలు అడుగంటడంతో పంటకు నీరందడం కష్టమైంది. దీంతో చేతికొచ్చిన పంటను కాపాడుకునేందుకు సాగర్ కాల్వలోనే బావులు తవ్వి భగీరథ ప్రయత్నం మొదలు పెట్టారు. అడపా దడపా లభ్యమైన నీటితో కొంతకాలం నెట్టుకొచ్చారు. ప్రస్తుతం ఎండలు ముదరడంతో కాల్వల్లో తవ్విన బావులు సైతం ఎండిపోవడంతో రైతులు చేతులెత్తేశారు. కంకులు పోసుకునే దశలోనే పంట పూర్తిగా ఎండిపోతుండడంతో సాగు రైతులు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు. వానకాలం సీజన్‌లో అదే భూమిలో పత్తి సాగు చేసిన రైతులకు చీడపీడల బెడద వల్ల కనీసం పెట్టుబడి కూడా రాని పరిస్థితి నెలకొంది. దీంతో పత్తి పంటను తొలగించిన రైతులు దాని స్థానంలో మక్క సాగు చేశారు. తీరా పంట చేతికొచ్చే సమయంలో నీటి ఎద్దడి తలెత్తడంతో రైతులు తలలు పట్టుకునే పరిస్థితి వచ్చింది. వానకాలం పత్తి పంటకు చీడపీడల బెడద, యాసంగిలో మొక్కజొన్న పంటకు నీటి ఎద్దడి వల్ల రెండు సీజన్లలో పూర్తిగా నష్టపోయామని, ప్రభుత్వం పరిహారం అందించి ఆదుకోవాలని సాగు రైతులు కోరుతున్నారు.



కాల్వలో బావి తీసినా ఫలితం లేకపోవడంతో వృధాగా ఉన్న పంపులు, మోటర్లు

### నీళ్లు లేక ఎండిన పంట



రెండెకరాలకు పైగా భూమిని కౌలుకు తీసుకున్నా. రూ.40 వేలకు కౌలు మాట్లాడుకొని కొంత భూ యజమానికి చెల్లించాను. వానకాలం సీజన్‌లో ఆ భూమిలో పత్తి సాగు చేశాను. నీళ్లు పుష్కలంగా ఉన్నా తెగుళ్లతో నాలుగు క్వింటాళ్ల పత్తి మాత్రమే చేతికొచ్చింది. పెట్టుబడిలో సగం కూడా చేతికి రాలేదు. యాసంగిలో మక్కసాగుతో లోటు పూడ్చుకోవచ్చని పంట వేశాను. పంట చేతికొచ్చే సమయానికి కాల్వలో నీళ్లు రాక.. బావిలో నీరు అడుగంటడంతో పంట ఎండిపోయింది. ప్రభుత్వం ఆదుకొని ఆర్థిక సహాయం అందిస్తేనే బయటపడుతాం.

–అంగిరేకుల కోటేశ్వరరావు, రైతు, ముత్తగూడెం రూరల్